క్లుప్తంగా

అమ్మవారికి వెండి సమర్పణ



అమ్మవారికి వెండి సమర్పిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరి అమ్మవారికి దాతలు 100 గ్రాముల వెండి విరాళంగా అందించారు. అమ్మవారికి వెండి పీఠం సంకల్పం చేసిన కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణానికి చెందిన చేగొండి ఏడుకొండలు, జ్యోతి దంపతులు 100 గ్రాముల వెండి విరాళంగా అందించినట్లు ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. అర్చకులు పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్ర పటాన్ని అందించారు.

రోడ్డు ప్రమాదంలో షాపు ధ్వంసం



ధ్వంసమైన షాపు

యలమంచిలి: మండలంలోని కాజ తూర్పు బైపాస్ రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక సోడా కొట్టు, రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. పాలకొల్లు నుంచి చించినాడ వైపు వెళ్తున్న టిప్పర్ లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీ కొట్టింది. ఆ వేగానికి రెండు వాహనాలు సోడా షాపులోనికి దూసుకెళ్లాయి. దీంతో వాహనాలతో పాటు ఆ షాపు ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న పోలీస్ బ్యాచ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: కానిస్టేబుల్ చినిమిల్లి వెంకటేశ్వరరావు కుటుంబానికి 2009 బ్యాచ్ పోలీసులు ఆర్థిక సహాయం అందించారు. ఆకివీడు పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబానికి తన సహచర బ్యాచ్ సభ్యులు లక్ష రూపాయలు ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సహాయ ఫౌండేషన్ టీం మెంబర్స్ పాల్గొని వెంటేశ్వరరావు మృతి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

బెల్టు షాపుపై దాడి



నీరుల్లిపాలెంలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

పెనుగొండ: ఆచంట మండలం వల్లూరు నీరుల్లి పాలెంలో బెల్ట్‌షాపుపై దాడి చేసి ఏడు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్ట్ చేసినట్లు పాలకొల్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మండలంలో అక్రమంగా మద్యం షాపు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడి చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సైలు పి.మహేష్, జి.రఘు తదితరులు పాల్గొన్నారు.

కంటి సంరక్షణ, వ్యాధులపై అవగాహన



కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న క్లబ్ ప్రతినిధులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి మూడో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీ నారాయణ, సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి భీమవరపు మహాలక్ష్మి కోరారు. స్థానిక కడకట్ల జనతా ట్రస్ట్ ఆవరణలో డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో దాత పదం కుమార్‌గుప్తా సహకారంతో నిడదవోలు రాజరాజేశ్వరీ రామకృష్ణ నేత్ర వైద్యశాల వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 93 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించగా, ఉచితంగా 22 మందికి కళ్లజోళ్లు ఇచ్చేందుకు నిర్ణయించారు. ఆపరేషన్ల నిమిత్తం 10 మందిని నిడదవోలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కంటి వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సుంకర శ్రీనివాస్, పచ్చ వెంకటేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులపై లోడు భారం

- చెల్లింపుపై 50 శాతం రాయితీ ఎర
- అధిక భారంతో సామాన్యుల గగ్గోలు



వేడిని తట్టుకోలేక రేకుల షెడ్డుకు ఏర్పాటు చేసిన ఏసీ



రేకుల షెడ్డుపై ఏర్పాటు చేసిన టీవీ డిష్

ఆకివీడు: విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం మరో పిడుగు వేసింది. తమ ప్రభుత్వం వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని మరిచి అదనంగా లోడు భారం వేసింది. లోడు డిపాజిట్లు చెల్లించాలని ప్రతి వినియోగదారుడిపై హుకుం జారీ చేస్తున్నారు. గతంలో వస్తున్న బిల్లుకు, వేసవిలో వస్తున్న బిల్లును పరిగణలోకి తీసుకొని అదనపు వినియోగం ఉందని వినియోగదారులు లోడు డిపాజిట్లుగా రూ.2,259 చెల్లించాలని ఆదేశించారు. జూన్ 30వ తేదీ లోపు చెల్లించిన వినియోగదారులకు 50 శాతం రాయితీ సదుపాయాన్ని కల్పించినట్లు చెబుతున్నారు. వేసవి తాపాన్ని తట్టుకునేందుకు ప్రతి ఇంట్లోనూ, గుడిసెలోనూ, రేకుల షెడ్లలో ఏసీలను ఏర్పాటు చేసుకుని ప్రజలు సేద తీరుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచే భానుడు భగ భగమంటూ తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఉదయం నుంచే వేడి గాలులతో వాతావరణం వేడెక్కి ప్రజలు రోడ్లపైకి రాలేని స్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ఇంట్లో ఉండి ఫ్యాన్ గాలికి కూడా తట్టుకోలేని స్థితిలో జనం ఉన్నారు. రేకుషెడ్లు, పెంకుటి శాలలు, చిన్నపాటి భవనాలతో పాటు అన్ని చోట్లా ఏసీలు ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈఎంఐలతో ఏసీలు

ఈఎంఐతో ఏసీలు అమ్ముతుండటంతో ప్రతి వ్యక్తి ఏసీ కొనుగోలు చేసి బిగించుకుంటున్నారు. ఏసీలు లేకపోతే ప్రాణం పోయే పరిస్థితి ఉండటంతో రేకుల షెడ్లలో కూడా ఏసీలు బిగిస్తున్నారు. ఏసీలు తిరగడంతో ఆయా వినియోగదారులకు వేలల్లోనే బిల్లులు వేస్తున్నారు. రూ.600, 700 బిల్లు వచ్చే వినియోగదారుడు పెంచిన బిల్లుతో పాటు, ఏసీ లున్న ఇళ్లకు రూ.2500 పైబడి, 3500 వరకూ బిల్లులొస్తున్నాయి. పలు రూపాల్లో విద్యుత్ బిల్లులు పెంచిన ప్రభుత్వానికి అదనపు లోడు కన్పించడంతో మళ్లీ వినియోగదారులపై గుదిబండ పడినట్లు అయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదనపు లోడు డిపాజిట్లు చెల్లించే ప్రసక్తి లేదని స్పష్టం చేస్తున్నారు. అయితే విద్యుత్ శాఖ సిబ్బంది మాత్రం వినియోగదారులపై దౌర్జన్యంగా అదనపు లోడు బిల్లు వసూలుకు సిద్ధమవుతున్నారు.

అదనపు భారం భరించలేం



విద్యుత్ చార్జీల బాదుడుతో ఇబ్బందులు పడుతున్న తమకు అదనపు లోడు భారం మోయలేని విధంగా ఉంది. చార్జీలు పెంచే ప్రసక్తి లేదంటూనే సంపద సృష్టితో బాదుడే బాదుడు చేసి, చార్జీలు, లోడు డిపాజిట్లు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలను కనికరించాలి.

–దోకల రవితేజ, గ్రామస్తుడు, ఆకివీడు

లోడు డిపాజిట్‌లో రాయితీ



విద్యుత్ అదనపు వినియోగంతో అదనపు లోడు చార్జీలను ప్రభుత్వం విధించింది. లోడు చార్జీ జూన్ 30 లోపు చెల్లిస్తే 50 శాతం రాయితీ కల్పించింది. సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ బకాయిలు గత మూడు నెలల్లో రూ.4 కోట్ల మేర ఉన్నాయి.

–రత్నాకర్, ఏఈ, ట్రాన్స్‌కో, ఆకివీడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: మండలంలోని పెదఅమిరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. పెదఅమిరం, కోపల్లె, వేంపాడు గ్రామాలకు, చెరువులకు, ఇండస్ట్రీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు పీజీఆర్ఎస్

పాలకోడేరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార (పీజీఆర్ఎస్) కార్యక్రమం ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటి గంటన్నర వరకు నిర్వహిస్తామని ఎంపీడీవో వి.రెడ్డయ్య తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ప్రజలు తమకున్న సమస్యలను అర్జీల రూపంలో ఇవ్వొచ్చన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు ఆ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు

భీమవరం: వసుధా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. డీఎన్నార్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 24వ తేది నుంచి మే 3వ తేది వరకూ ఈ శిక్షణా తరగతలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు క్లాసులు నిర్వహించి స్టడీ మెటరీయల్ ఉచితంగా అందజేస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీటీసీ): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ఈ నెల 21వ తేదీ సోమవారం పురపాలక సంఘ కార్యాలయం వద్ద నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. కార్యక్రమం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యలు ఉంటే వేదికకు తెలియజేయాలని, సకాలంలో నిబంధనల మేరకు పరిష్కరించనున్నట్లు ఆయన వివరించారు.

శతాబ్ది రాములోరికి గుడి



నూతనంగా నిర్మించిన కోదండ రామాలయం



ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న విగ్రహాలు

ఆకివీడు: స్థానిక ఎస్ టర్నింగ్ వద్ద శతాబ్ది కాలం క్రితం ఏర్పాటు చేసిన రాములోరి ఆలయానికి నూతన శోభ చేకూరింది. పూరి గుడిసె నుంచి చిన్న గదిలో ఉన్న రాములోరి ఆలయం శిథిలావస్థకు చేరడంతో పక్కాగా గుడి నిర్మించడంతో స్థానిక భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం నుంచి ఆలయం వద్ద నిర్వహించనున్నారు. పురాతన విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేశారు. మహాబలిపురంలో తయారు చేసి, తీసుకొచ్చిన విగ్రహాలను మంగళవారం ప్రతిష్ఠించనున్నారు. సోమవారం నుంచి ఆలయం వద్ద హోమాలు, ఇతర పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్మాణకర్తలు భీష్మ, హరి తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

భీమవరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా భీమవరం యూనిట్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం పట్టణంలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా మంతెన వెంకటనర్సింహ సీతారామరాజు, కటికరెడ్డి వెంకటరత్నం, ఉపాధ్యక్షుడిగా బోనం పాండురంగారావు, సరిపిడకల రామరావు, చైర్మన్‌గా మట్లపూడి సత్యనారాయణ, కోశాధికారిగా శ్రీఖాకొల్లు హనుమంతరావు, మరో 20 మంది సభ్యులతో యూత్ హాస్టల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వీవీజే సోమరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నర్సింహ సీతారామరాజు మాట్లాడుతూ యూత్ హాస్టల్ భవన నిర్మాణానికి స్థలం సమకూరితే తన సొంత నిధులతో భవనం నిర్మిస్తానన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు, యూత్ అడ్వంచర్ కార్యక్రమాల్లో పాల్గొనే పేద విద్యార్థులకు యూత్ హాస్టల్ తరఫున ఆర్థిక సాయమందిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్వో తాళ్లపూడి గాంధీ, ఆరేటి వెంకట సత్యనారాయణ, వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, కట్రెడ్డి సత్యనారాయణ, నందమూరి రాజేష్, బొండా శ్రీరామ్, పెన్మెత్స భాస్కరపెద్దిరాజు, కడియం ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఇంటికే వైద్య సేవలు



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్య సేవలు అందించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య ప్రత్యేక వాహనం ద్వారా తణుకు, చివటం ప్రాంతాల్లో పర్యటించి ఎనిమిది మంది వృద్ధులకు వైద్య సేవలు అందజేశారు. సభ్యులు షేక్ మస్తాన్ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్య సేవలకు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి ఆర్జి భాస్కరరావు, గిరిజాల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



అగ్నిమాపక వారోత్సవాల్లో అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్స్

నరసాపురం: వేసవిలో అగ్నిప్రమాదాల విషయంలో జగ్రత్తలు తీసుకోవాలని నరసాపురం అగ్నిమాపకశాఖ అధికారి కె.భాస్కరరామ్ సూచించారు. గత వారం రోజులుగా నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక ఫైర్ స్టేషన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్స్ అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరిగే ఉన్న ప్రదేశాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మంటలు ఎలా అదుపు చేయాలి? అనే అంశంపై అవగాహన కల్పించి, డెమో నిర్వహించారు. ఎన్‌సీసీ పీటీ ఇన్‌స్ట్రక్టర్ పీఎన్ బాబు, ఫైర్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక సిబ్బంది అందించే సేవలు అభినందనీయమని ఏఎస్ఎన్ఎం కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.రామకృష్ణ అన్నారు. ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు రామకృష్ణ, డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు కంగారులో ఏదో ఒకటి చేసేయాలనే ఉద్దేశంతో మరింత నష్టానికి కారకులవుతుంటారన్నారు. సమయస్ఫూర్తితో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టాన్ని కూడా తగ్గించవచ్చన్నారు. అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్ ద్వారా అనేక సూచనలు చేస్తున్నారని వాటిపై ప్రజలు మరింత అవగాహన కలిగి ఉండడం వల్ల ప్రమాదాలు జరగకుండా నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కె.అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

మరణం లేని మహోన్నతుడు క్రీస్తు

- క్రైస్తవులతో కిటకిటలాడిన చర్చిలు
- సమాధుల వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనలు



ఆకివీడు: సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



భీమవరం అర్బన్: గూట్లపాడులో సమాధుల వద్ద ప్రత్యేక పుష్పాలంకరణ చేసిన క్రైస్తవులు

ఆకివీడు: క్రీస్తుకు మరణం లేదు. ఆయన విశ్వవ్యాప్తంగా జీవించి ఉన్నాడని పాదర్ రెవరెండ్ గూడపాటి జోసఫ్‌రాజు చెప్పారు. స్థానిక దొరగారి చెరువు సమీపంలో ఉన్న క్రిస్టియన్ శ్మశాన వాటిక వద్ద ఈస్టర్ సందర్భంగా చూట్ గేమ్స్ (చూట్ దొర)ను సమాధి చేసిన ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మానవాళి పాపం విమోచనకు ఆయన ప్రపంచంలో జీవించారన్నారు. క్రీస్తు బోధనలు ప్రపంచానికి ఎంతో అవసరమన్నారు. ఈస్టర్ సందర్భంగా మండలంలోని పలు చర్చిలు, సమాధుల వద్ద ప్రార్థనలు చేశారు.

వైభవంగా ఈస్టర్ పండుగ

ఉండి: ఏసుక్రీస్తు మరణించి తిరిగి లేచిన సందర్భాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈస్టరు పండుగ ఆదివారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఉండి సెయింట్‌పాల్స్ లూథరన్ సంఘంలో పాస్టర్ రెవరెండ్ మానుకొండ ప్రసన్నకుమార్, ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ సంఘంలో పాస్టర్ రెవరెండ్ మేషక్ సతీష్ కుమార్, యండగండి ఇమ్మానుయేలు లూథరన్ సంఘంలో పాస్టర్ వి.నెహ్రూ ఆధ్వర్యంలో సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యండగండిలో సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి క్రైస్తవ సోదరులకు ఈస్టరు శుభాకాంక్షలు తెలిపారు. మనిషి చేసే ప్రతీ పాపం ఆ మనిషిని మరణానికి అప్పగిస్తుందని యేసుక్రీస్తు మరణించి తిరిగి లేవడంతో మనిషి చేసిన పాపం క్షమించబడిందని పాస్టర్స్ ప్రసన్నకుమార్,సతీష్‌కుమార్ వాక్యోపదేశం చేసారు.దేవుడు ప్రతీ మనిషికి పవిత్రమైన జీవితాన్ని ఇచ్చాడని దానిని కపాడుకుంటూ పరోపకారులుగా జీవించాలని అన్నారు.దేవుడు ఇచ్చిన మరోజన్మను మనం సార్థకం చేసుకుని క్రైస్తవుడంటే సమాజానికి మంచి చేసేవాడని చాటిచెప్పాలని వారు కోరారు. ఆయా కార్యక్రమాల్లో సంఘ పెద్దలు,పీసీసీ సభ్యులు,యూత్,స్త్రీల సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీస్తు పునరుత్థాన వేడుకలు

కాళ్ల: బైబిల్ లేఖనాల ప్రకారం క్రీస్తు చనిపోయి మూడోరోజైన ఆదివారం తిరిగి లేచినట్లు పలువురు దైవజనులు తెలిపారు. క్రీస్తు పునరుత్థాన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈస్టర్ పర్వదిన సందర్భంగా మండలంలో అన్ని గ్రామాల్లో ఆదివారం తెల్లవారు జామున సమాధుల తోటలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా సంఘాల విశ్వాసులు, సంఘపెద్దలు, యూత్, స్త్రీల సమాజ సభ్యులు, సండేస్కూలు చిన్నారులు, సంఘస్తులు పాల్గొన్నారు.

బేతని చర్చిలో..

భీమవరం: ఏసుక్రీస్తు శిలువ వేయబడి మూడవ రోజున లేవడమే పవిత్రమైన ఈస్టర్ పర్వదినమని పాస్టర్ టి.డానియేల్ జయప్రకాష్ అన్నారు. ఆదివారం స్థానిక బేతని చర్చిలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీస్తు కొరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రాజ్ ట్రస్ట్ అధ్యక్షుడు గంటా రాజ్ కుమార్ ఆధ్వర్యంలో డ్రింక్స్, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టా దేవరాజ్, డి.వర్గీస్ డేనియల్, గంటా సుందర్‌కుమార్, పి.విల్సన్, పి.కెనడీ, సంఘస్తులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు నేడు లేచెను

భీమవరం అర్బన్: సిలువపై మేకులతోనూ, ముళ్ల కిరీటంతో ఎన్నో కష్టాలు పడి సమాధి కాబడిన ఏసు క్రీస్తు పాపులను రక్షించుటకు నేడు సజీవంగా లేచారని రెవరెండ్ సువర్ణరాజు అన్నారు. మండలంలోని గూట్లపాడులో ఈస్టర్ సందర్భంగా ఆదివారం సమాధులను పూలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ సువర్ణరాజు మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో వర్ధనపు సాల్మన్, మాదాసి ఆదాము, దేశభక్తుల మోహన్, బందుల సైమన్ పీటర్, కర్ర శ్రీకాంత్, పాడపాటి సుధీర్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఈస్టర్

పాలకోడేరు: సర్వ మానవాళికి ఏసుక్రీస్తు రక్షకుడని విశ్రాంత సబ్ ఇన్‌స్పెక్టర్ బలే జోసఫ్‌రాజు బోధించారు. ఈస్టర్ పర్వదినం పురస్కరించుకొని క్రైస్తవ సోదరులు మండలంలోని శృంగవక్షం, మోగల్లు, పాలకోడేరు, గొల్లలకోడేరు గరగపర్రు, వేండ్ర, కొండేపూడి, కుముదవల్లి, విస్సాకోడేరు, పెన్నాడ, గొరగనమూడి, కోరుకొల్లు, మైప తదితర గ్రామాల చర్చిల్లో ప్రార్థనలు చేశారు. మోగల్లు సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో ఇవాంజెలిస్ట్ గోపే సాల్మన్ రాజు అధ్యక్షతన వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాఖపట్నానికి చెందిన రెవరెండ్ పి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పాపాన్ని విడిచి మారు మనసు పొందాలని సూచించారు. మరో ముఖ్య అతిథి చిల్లా విక్టర్ బాబు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన బోధనలు ద్వారానే నిత్య జీవమని నొక్కి వక్కాణించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి, సీహెచ్ లేయ ప్రశాంతి, ప్రముఖ న్యాయవాది నేతల శ్యామ్ కుమార్ ఎంపీటీసీ కాటూరి శాంతకుమారి, వార్డు మెంబరు బలే చిట్టిబాబు, పీసీసీ కొనలపల్లి నాని, సంఘ కాపరులు, విశ్వాసులు, పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలో ట్రినిటీ లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఉండి: యండగండిలో ఈస్టరు శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచ్ చినకృష్ణమూర్తి



పాలకోడేరు: మోగల్లు సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు